# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# ఆ చీకటి పాలన మాకొద్దు

- కాంగ్రెస్‌ను నమ్మితే బతుకులు ఆగమే
- బీఆర్ఎస్సే రైతులకు రక్ష
- కేసీఆర్‌నే గెలిపించుకుంటం
- స్పష్టం చేసి రైతులు

ఉమ్మడి పాలనలో రైతులు అరిగోస పడ్డారు. సరిపడా కరెంట్ లేక, అస్తవ్యస్తమైన భూ రికార్డులతో ఆగమయ్యారు. పాసుబుక్కుల్లో భూములు తారుమారు కావడంతో తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నది. భూముల భద్రతకు పటిష్టమైన ధరణి పోర్టల్ తెచ్చింది. అనేక మాడ్యూళ్ల ద్వారా రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ తదితర ప్రక్రియలను సులభతరం చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు ఎవుసానికి 3 గంటల కరెంట్ సాలని, ధరణిని బంగాళాఖాతంలో కలుపుతమని ఆగం చేస్తున్నారు. వారి విధానాలను తెలంగాణ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్ చీకటి పాలన తమకొద్దని, మమ్మల్ని పరేషాన్ చేస్తున్న వాళ్లకు బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్సే తమకు శ్రీరామరక్ష అని, రైతు బాంధవుడు కేసీఆర్‌ను గెలిపించుకుంటామని చెబుతున్నారు.

*- రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)*

## ధరణిజెయ్యవట్టే మా భూములు భద్రంగున్నయి



ధరణి పోర్టల్ పేరు వింటేనే కాంగ్రెసోళ్లు గడగడలాడుతున్నరు. అందుకే నోటికచ్చినట్లు మట్లాడుతున్నరు. ధరణిజెయ్యవట్టె భూములు భద్రంగున్నయి పైగా భూముల విలువ కూడా చానా పెరిగింది. ఇంతకుముందు ఎవరైన భూములు కొనాలంటే ఎంతో ఇబ్బందిపడేవాళ్లం. ఇప్పుడు భూమి అమ్మేవారు, కొనేవారు, వేలిముద్ర పెడితే క్షణాల్లోనే రిజిస్ట్రేషన్లు కావట్టే. దళారులకు తావేలేదాయె. కానీ కాంగ్రెసోళ్లు వత్తే మాత్రం మళ్లీ పాత పద్ధతే వత్తది. మళ్లంతా దళారుల రాజ్యమేలుతరు.

*- లంబ తిరుపతి, వెంకటాపూర్ (తెలంగాణచౌక్)*

## వాళ్లత్తే సమస్యలు ఎక్కువైతయ్



కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావడానికి రైతులకు అనేక మాయమాటలు చెబుతున్రు. కాంగ్రెసోళ్లను ఎవరూ నమ్మరు. ధరణి స్థానంలో భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామని చెబుతున్రు. భూమాత పోర్టల్ ద్వారా ఒకరి భూములు మరొకరికి రెవెన్యూ అధికారులు మార్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ పోర్టల్ ద్వారా రైతుల భూ వివరాల తారుమారవుతయ్. మళ్లీ భూ సమస్యలు ఎక్కువైతయ్. మల్లా వాళ్ల చుట్టూ, వీళ్ల చుట్టూ తిరుగుడైతది. అందుకే సీఎం కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వోలను తొలగించి ధరణి పోర్టల్ తీసుకొచ్చిండు. ఆన్‌లైన్ పద్ధతిలో సులభమైన పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకొని పది నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నం. ధరణి ద్వారా ఎలాంటి అవినీతికి తావులేకుండా భూములు పట్టా అయితున్నయి. ఇంత మంచిగున్న ధరణి తీసేస్తమంటున్న కాంగ్రెసోళ్లకు బుద్ధి లేదు.

*-ఉప్పులూటి గణేశ్, రైతు(రుద్రంగి)*

## ఎప్పుడూ.. కరెంట్ బాయికానే ఉండేటోళ్లం



కాంగ్రెస్ ఉన్నప్పుడు పగలు అనకుండా రాత్రి అనకుండా బాయికానే ఉండేటోళ్లం. కరెంట్ ఎప్పుడు వచ్చేదో.. పోయేదో తెలియదు. ఒకసారి పెట్టి ఇంటికి పోగానే కరెంటు పోయేది. మళ్లీ వచ్చి కరెంట్ పెట్టి అక్కడే ఉండేటోళ్లం. ఒక గుంట పారే వరకు ఉన్న కరెంటు పోయి ఎప్పుడు వచ్చేదో తెలియదు, ఎప్పుడు పోయేదో తెలియదు. కానీ ఇప్పుడు 24 గంటల కరెంటు ఉండడం వల్ల ఏ సమయానికి పోయిన కరెంట్ పెడితే నీళ్లు వస్తున్నయి. సీఎం కేసీఆర్ 24 గంటలు కరెంటు ఇవ్వడంతో పంటలు పండుతున్నయి. ఇప్పుడు ఇంటికానే నిద్రపోతున్నం. పొద్దున పోగానే కరెంట్ పెడితే నీళ్లు వస్తున్నయి. ఇంతకంటే మాకు ఇంకా ఏం కావాలి.

*- బోడపట్ల వెంకటి, నమిలిగుండుపల్లి (వేములవాడ రూరల్)*

## 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటరా?



తెలంగాణ రాకముందు ఎవుసం సక్కగలేదు. కరెంట్ కోతలతో చాలా అవస్థలుపడ్డం. ఆరు గంటల కరెంటు ఇస్తమని చెప్పి మూడు గంటలే ఇచ్చేది. నాణ్యమైన కరెంట్ రాక మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేటివి. వాటిని మంచిగ జేసేసరికి పంటలు ఎండిపోయేటివి. మళ్లీ అధికారం కోసం మూడు గంటల కరెంట్ సాలు..10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని దొంగ మాటలు చెపుతున్రు. ఈ మాటలు రైతులు నమ్మే పరిస్థితి లేదు. 10హెచ్‌పీ మోటర్లు ఏ రైతులు పెట్టుకోరూ. 10 హెచ్‌పీల మోటర్లు రైతులపై ఆర్థిక భారంపడుతది. కేసీఆర్ సార్ ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో ఫుల్ ఖుష్‌గా ఉన్నం. ఎప్పుడు వీలు ఉంటే అప్పుడు పొలంకాడికి పోయి పొలాలు పారించుకుంటున్నం. సీఎం కేసీఆర్ సార్ తోనే రైతులు ఆనందంగా ఉన్నారు.

*- సింగిరెడ్డి ముత్యంరెడ్డి, అంకిరెడ్డిపల్లె (సిరిసిల్ల రూరల్)*

## మా బతుకుల్లో నిప్పులు పోస్తే ఊకోం



కాంగ్రెస్ ధరణి తీసేస్తమంటే భూముల కాడ గెట్ల పంచాయితీలు అయితయి. మళ్లా పాత కాలం నాటి రాతలు వస్తయ్. ఒగల భూమి ఒగలకు రాసి చిచ్చు పెడతరు. దళారుల దగ్గరికి పోయేటట్లు జేస్తరు. సర్కార్ సాయం పంటల పెట్టుబడి, రైతు బంధు అందదు. భూముల కాడ లొల్లులైతయ్. కొట్లాటలతో పోలీస్ స్టేషన్లు, కోర్టులు, ఆఫీసుల సుట్టూ తిరుగుడు అయితది. ధరణి వచ్చినప్పటి నుంచి రైతులు నయాపైస ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నరు. కేసీఆర్ సారు ధరణి తెచ్చి రైతుల కష్టాలు తీర్చిండు. కాంగ్రెస్ పాలనలో భూ సమస్యల పరిష్కారం కోసం నెలలు, ఏండ్ల కాలం పట్టేది. రెవెన్యూ ఆఫీసుల సుట్టూ తిరిగి తిరిగి పనికాకపోయేది. అట్లాంటి పాత రోజులు రావద్దు. మళ్లా అప్పటి కష్టాలు కండ్ల ముందు కనబడుతయ్. మా బతుకుల్లో నిప్పులు పోస్తే ఊకోం.

*-ఏరెడ్డి రాజిరెడ్డి, రైతు, రామన్న పేట(చందుర్తి)*

## వాళ్లు వచ్చేదిలేదు.. సచ్చేదిలేదు..



ధరణి పోర్టల్ వచ్చినంక లంచాలకు అడ్డుకట్టపడింది. మా భూములను దర్జాగా సాగు చేసుకుంటూ పంటలు పండిస్తున్నం. గతంలో భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే దళారుల అవసరం ఉండేది. వారు అడిగినంతా పైసలు ఇస్తేనే పనియ్యేది. కాంగ్రెస్ నాయకులకు మేము బాగుపడడం ఇష్టం లేదు. మమ్మల్ని దోచుకోవడానికి వారు ధరణి పోర్టల్‌ను తీసివేస్తామంటున్నరు. అసలు వారు మతిఉండి మాట్లాడుతున్నారా. పాత కాలం చట్టాలను పట్టుకొని ఇంకా వేలాడుతున్నారు. మరలా వీఆర్వో వ్యవస్థను తీసుకువస్తే రైతులు ఆగం కావాల్సిందే. సర్వే నంబర్ల సాయంతో ఇప్పుడు మా భూములను సెల్‌ఫోన్లనే సూసుకోవడితిమి. మీ ఆటలు ఇక్కడ సాగవు. మీరు వచ్చేది లేదు.. సచ్చేదిలేదు. మళ్లా కాంగ్రెస్‌కు ఓటేసి మా బతుకులను నాశనం చేసుకోలేము.

*- పెడతనపల్లి నాంపెల్లి, రైతు (వీర్నపల్లి)*

## మళ్ల ఆగంకావద్దు.. కేసీఆర్‌నే గెలిపించుకుంటం



ధరణి రద్దు చేస్తామంటున్న రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతం. గతంలో ఎవరూ పైసలితే వారికే పేదోళ్ల భూముల పట్టాజేత్తుండె. పట్వారీలదే పెత్తమముండేది. పాత వ్యవస్థ ఉంటే ఊళ్లో మళ్లీ గొడవలు అయితయి. ధరణి మంచిగున్నది. సమస్యలున్నోళ్లకు సార్లకు దరఖాస్తు పెట్టుకుంటే పరిష్కారం జేత్తున్నరు. ధరణిని రద్దు చేస్తామంటున్న ధరణికి ఓటుతోనే సమాధానం చెబుతం. కేసీఆర్ ఆలోచనతోనే ధరణి మాకు లాభమైతంది. ఏ అధికారి సుట్టూ తిరగాల్సిన పనేలేదు. సెల్‌ఫోన్‌లో కూడ మా భూములు పాస్‌బుక్‌లో ఎంత ఉన్నాయో సూసుకుంటున్నం. పొరపాటున కాంగ్రెసోళ్లకు ఓటేత్తే కథ మళ్లీ మొదటికి అచ్చినట్టే. అనవసరంగా ఆగంకావద్దు. సాగును బంగారం చేసిన కేసీఆర్‌కు అండగా ఉండాలె. మూడోసారి సీఎంను చేసుకోవాలె.

*- సిహెచ్ శ్రీనివాస్, వట్టెంల (వేములవాడ రూరల్)*

## మూడుగంటలతో నారుమడి తడ్వది



కాంగ్రెస్ నాయకుడు ఇస్తానన్న మూడు గంటల కరెంటుతో నారుమడి కూడా తడువది. నీళ్లు సరిపోక వ్యవసాయం చేయడం కష్టమై మళ్లీ దేశాలు పట్టుకొని పోవాల్సి వస్తది. కేసీఆర్ సారు 24గంటల కరెంట్ ఇచ్చి ఎంతో మేలు చేస్తున్నడు. కరెంటు, నీళ్లు పుష్కలంగా ఉండవట్టే పదేండ్ల సంది గల్ఫ్ వెళ్లకుండా ఇంటి పట్టునే ఉంటున్న. భార్యా పిల్లలతో కలిసి ఎవుసం చేసుకుంటున్న. మళ్లీ కాంగ్రెసోళ్లు వస్తే రైతులకు కరెంట్ కష్టాలు తప్పవు. ఆ మూడు గంటల కరెంట్ సరిపోకపోతే 10హెచ్‌పీ మోటర్లు పెట్టి పారించుకొమ్మని మాట్లాడుతుండు రేవంత్‌రెడ్డి. అంత పెద్ద మోటర్లు వాడితో భూగర్భజలాలు ఎండిపోతయి. వాళ్ల పాలనలో చూసిన కరువుకే ఇప్పటికీ కోలుకోలేకపోతున్నం. కేసీఆర్ సారు ఇప్పుడు ఇస్తున్న కరెంట్ మంచిగుంది. కాబట్టి మళ్లీ కేసీఆర్ సారుకే ఓటేసి గెలిపించుకుంటం.

*- గెంటె రాములు, రైతు, వెంకటాపూర్ (తెలంగాణచౌక్)*

## రిజిస్ట్రేషన్ కోసం తిప్పెటోల్లు



కాంగ్రెస్ ధరణి తీసేసి భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామంటున్రు. కౌలుదారులు, అనుభవదారులు కాలం అంటూ రెవెన్యూ వ్యవస్థను మొదటికి తెస్తరు. గట్లయితే మళ్ల ఊర్లల్ల గెట్ల పంచాయితీలు మొదలైతయి. పోలీస్‌స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుడైతది. గతంలో రిజిస్ట్రేషన్ అయినంక డాక్యుమెంట్లు తెచ్చి తహసీల్దార్ కార్యాలయంలో తమ పేరు మీద రికార్డులకు ఎక్కించుకోవడానికి చాలా కష్టమయ్యేది. భూములు పట్టా చేయించుకునేందుకు వీఆర్వో దగ్గరికి ఎన్ని రోజులు తిరిగినా పని కాకపోయేది. ఏండ్లకేండ్లు తిప్పెటోళ్లు. పనిడిసిపెట్టి ఆఫీసుల చుట్టూ, వీఆర్వోల చుట్టూ తిరుగడయ్యేది. కానీ ఇప్పుడు ధరణితో భూముల పట్టాలు చకచకా జరుగుతున్నయి.

*- మరిగడ్డ నరేశ్, రైతు(రుద్రంగి)*

## వాడొద్దు.. వాడిచ్చే మూడు గంటల కరెంటొద్దు



ఆనాడు రాత్రిపూట కరెంటు ఇచ్చేటోళ్లు. నీళ్లు పెట్టడానికి బాయికాడికిపోతే పురుగుబుసి ఏడకుడోనని భయపడు కుంట పొలంకాడికి పోయేటోళ్లం. వచ్చిన కరెంటోమో సక్కగ ఉండకుంటుండె. కరెంటు కోసం బావులకాడనే రాత్రంతా జాగారం జేసినం. వేసిన పంట చేతికివచ్చుడే నమ్మకం లేకుంటుండె. చానా మంది రైతులు ఏసిన పంట ఎండిపోయి పెట్టుబడి కూడా రాకా, అప్పులపాలైతుండె. కేసీఆర్ సారు మా కష్టాలను జూసిండు. ఎవుసానికి ఫుల్లు కరెంటు, పుష్కలంగా నీళ్లు, పెట్టుబడికి పైసలు ఇయ్యవట్టే. ఇగ రందీలేకుండ ఎవుసం జేయ్యవడితిమి. ఈ నాలుగు దినాలు మంచిగున్న మమ్మల్ని జూసి కాంగ్రెసోళ్ల కండ్లు మండుతున్నట్టు ఉన్నయి. గా రేవంత్‌రెడ్డి గిప్పుడొచ్చి 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలె.. మూడు గంటల కరెంట్ ఇత్తమనవట్టె. ఇగ వాడి మాటలు వింటే మేమే బతికినట్టే. వాడొద్దు.. వాడిచ్చే మూడు గంటల కరెంటొద్దు.. కేసీఆర్ ముఖ్యమంత్రిగ ఉంటే అదే సాలు.

*- కుర్మ పరశురాములు, వెంకటాపూర్ (తెలంగాణ చౌక్)*